# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 36 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 10 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :36 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 10 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## తమిళనాడులో టీవీకే ప్రభంజనం..
### రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో అధికార టీవీకే పార్టీ ప్రభంజన సృష్టించింది. సీఎం విజయ్ పాలనకు రెఫరెండంగా భావించిన ఉపఎన్నికల్లో ధారాపురం, మధురాం తకం స్థానాలను గెలుచుకుంది.

- మిగతా 2లో

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త..
### సజ్జనార్ హెచ్చరిక!



పెన్ పవర్ డెస్క్:అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని

- మిగతా 2లో



# ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్



### వైసీపీ పిటిషన్ కొట్టివేత

- ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్
- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

- మిగతా 2లో






## రైతులు పంట గురించి ఆలోచించాలే
# తప్ప ఆందోళన చెందకూడదు

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

- మిగతా 2లో





## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

పెన్ పవర్ డెస్క్:సర్ ప్రక్రియలో అక్రమాలతో ఓట్ చోరీ చేశారని, చీఫ్ ఎలక్షన్ కమిషర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన క్రమంలో సెంట్రల్ ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు పోలీసులు. (శుక్రవారం) రాత్రం 10 నుంచి సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా మెట్రో స్టేషన్ల మూసివేతతోపాటు

- మిగతా 2లో

## యువతను ఎవరూ ఆపలేరు
### ఢిల్లీ ఆంక్షలపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు



- భారత యువతను ఎవరూ అడ్డుకోలేరన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్
- ఢిల్లీలో సీజేపీ నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై కఠిన ఆంక్షలు
- రాజధానిలో 23,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో



## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు

పెన్ పవర్ డెస్క్:విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయను న్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల

- మిగతా 2లో



## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ
# చెస్ కెరటం చల్లా నిహారిక

- మంత్రి లోకేశ్‌తో యువ చెస్ క్రీడాకారిణి నిహారిక భేటీ
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించినందుకు అభినందనలు
- ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని వెల్లడించిన నిహారిక
- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ

- మిగతా 2లో

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు



పెన్ పవర్ డెస్క్: ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండీ కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో

- మిగతా 2లో

## దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!



పెన్ పవర్ డెస్క్:నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు తాను అర్హుడనని.. అది తనకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ పిళ్లైకు

- మిగతా 2లో



## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై
# పవన్ కల్యాణ్ సీరియస్..
### విచారణకు కమిటీ

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా? బలమైన ఎల్ నినో ఇదేనట

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణం ఇలాగే కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది.

**కాంక్రీట్ జంగిల్ గా ...**

కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న ప్రపంచంతో పాటు, అడవుల నరికివేతతో వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో.. సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది.

**వేడి తీవ్రత ఎక్కువయి...**

ఈ పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని తెలిపారు. దీనివల్ల భూమి పై చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతుందని ని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. .ఎల్‌నినో వల్ల జూన్–సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి. ఈ ప్రభావంతో దేశంలో పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

భేటీ అనంతరం ఇండీ కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, ప్రియాంకగాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. "ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో రాష్ట్రపతి ఆధారాలు అడిగారు. వాటిని అందజేశాం. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి." అని రాహుల్ గాంధీ

# విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజి తరువాయి

పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

# రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంఢ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్–2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దొనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని

మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది.గత కొంత కాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

# మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి, ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ చల్లా నిహారిక రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను సాధించిన నిహారికను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ భేటీలో నిహారిక సాధించిన విజయాలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిహారిక ప్రతిభ, పట్టుదల భవిష్యత్తులో ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా తన భవిష్యత్ లక్ష్యాలను నిహారిక మంత్రికి వివరించింది. ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది. ఆమె ఆకాంక్షలను విన్న మంత్రి లోకేశ్, లక్ష్యసాధనలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన పునరుద్ఘాటించారు.

# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!

- మొదటి పేజి తరువాయి

ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు.ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు.అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్ల మధ్యకు రావడం ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు.ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించడంపై ఇప్పటికే జీహెచ్ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, వేడుకల కోసం అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నా, మళ్లీ అర్ధరాత్రి వేడుకలకు వస్తుండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

- మొదటి పేజి తరువాయి

ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 10న సీజేపీ, విద్యార్థి సంఘాల నిరసనలకు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిరసనల్లో రూల్స్ ఉల్లంఘించినందుకు తాజా నిరసనలకు అనుమతి నిరాకరించారు.ముందస్తు చర్యల్లో భాగంగా మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ సేవల నిలిపివేత, భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు.

మరోవైపు ఢిల్లీలోని 57 మెట్రోస్టేషన్లను మూసివేస్న్?నట్లు ఐవీ=జ ప్రకటించింది. పోలీసుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రినుంచే సెంట్రల్ ఢిల్లీలోని మెట్రో స్టేషన్లలో రాకపోకలను

నిలిపివేస్తున్నట్లు తెలిపింది. న్యూఢిల్లీ జిల్లాలోని జంతర్ మంతర్ తో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో నిరసనల్లో పాల్గొనేందుకు నిరసనల కారులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని గుర్తించిన మెట్రో స్టేషన్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు DMRC ని కోరారు.

# యువతను ఎవరూ ఆపలేరు

రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై విధించిన ఆంక్షలపై ఆయన ఈ విధంగా స్పందించారు. శుక్రవారం కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం చిరాగ్ పాశ్వాన్ విలేకరులతో మాట్లాడారు. "వీరు భారత యువత, వీరిని ఎవరూ ఆపలేరు. ఎన్ని రైళ్లను ఆపగలరు? రవాణా సౌకర్యాలను ఎంతవరకు నిలిపివేయగలరు? ఎన్ని రోడ్లను దిగ్బంధించగలరు? ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సత్తా భారత యువతకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వారిని ఎవరూ అడ్డుకోలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు.సీజేపీ నిరసన కారణంగా న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రావాల్సిన, వెళ్లాల్సిన పలు రైళ్లను భారతీయ రైల్వే రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి షెడ్యూళ్లను మార్చింది. ఈ నిరసన నేపథ్యంలో రాజధానిలో 23,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని ఒక ఇనుప కోటలా మార్చేశారు.గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా నిర్వాహకులు చట్టపరమైన ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, ఢిల్లీ పోలీసులు ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా, 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ప్రతిపాదించారు. పోలీసుల ప్రతిపాదన మేరకు, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తొలుత ప్రకటించింది.అయితే, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. శనివారం నాటి నిరసనను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను పూర్తిగా నిలిపివేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన నియంత్రణలతో మెట్రో, ఇతర రైల్వే సేవలు కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై ట్రంప్ పరోక్షంగా స్పందించారు. ఆయనకు మద్దతుగా ఓ సీనియర్ న్యాయవాది ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టును రీపోస్టు చేసిన ఆయన.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు."అమెరికా, ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ద్వేషించే వ్యక్తి నవనీతమ్ పిళ్లై. శాంతిని పెంపొందించడానికి ఆమె ఎన్నడూ ప్రయత్నించలేదు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి.. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ట్రంప్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గాజాను పునర్నిర్మించడానికి కృషి చేస్తున్నారు. అసాధ్యం అనుకున్న అబ్రహం ఒప్పందాన్ని అందించారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఇలాంటి విషయాలను గుర్తించాల్సింది" అని అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షోయెన్ పెట్టిన పోస్టుపై ట్రంప్ స్పందించారు.

# తమిళనాడులో టీవీకే ప్రభంజనం..

## రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ

- మొదటి పేజి తరువాయి

2026 అక్టోబర్ 9న జరిగిన కౌంటింగ్ లో ముందునుంచీ టీవీకే అభ్యర్థులు లీడ్ లో కొనసాగుతూ చివరికి విజయం సాధించారు. ధారాపురం నియోజకర్గంలో టీవీకే అభ్యర్థి సత్యభామ గెలుపొందారు. మొత్తం 23 రౌండ్ల కౌంటింగ్ తర్వాత సత్యభామ 9 వేల 471 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమెకు మొత్తం 66 వేల 841 ఓట్లు వచ్చాయి. అంటే 37.02 శాతం ఓట్లతో గెలుపొందారు. ఇక డీఎంకే 57 వేల 370 ( 31.78%) ఓట్లతో రెండో స్థానంలో నిలవగా.. అన్నాడీఎంకే 45 వేల 280 ( 25.08%) ఓట్లు సాధించింది. ధారాపురంలో జనరల్ ఎలక్షన్లలో 40 వేల ఓట్లతో ఓడిన టీవీకే.. ఇప్పుడు దాదాపు పదివేల ఓట్ల తేడాతో గెలుపొందటం గమనార్హం. ఇక మధురాంతకంలో 19 వేల 241 ఓట్లతో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్ విజయాన్ని అందుకున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచుతూ పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు.ఇక తమ పాలనకు రెఫరెండంగా భావించి ఉపఎన్నికలకు వెళ్లిన టీవీకే.. తమ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని.. ప్రజలు సంతృప్తిగా ఉన్నారని భావిస్తోంది. పార్టీ గెలుపుతో కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

## విద్యార్థినుల భవిష్యత్తుకు మానసిక ఆరోగ్యం, కెరీర్ మార్గదర్శకత్వం కీలకం




**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 09:**ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందపురంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు కెరీర్ మార్గదర్శకత్వం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెరీర్, మానసిక ఆరోగ్య సలహాదారులు బి. రామ దివ్య, టి. దుర్గ శ్రావంతి (సమగ్ర శిక్ష) పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్తులో అందుబాటులో ఉండే ఉద్యోగ, వృత్తి అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చదువులో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం, సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం, భావోద్వేగాలను సమర్థవంతంగా నియంత్రించుకోవడం వంటి అంశాలను వివరించారు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ, ఆలోచనాత్మకంగా కెరీర్ నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు.

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా



వివరాలు 4లో..

## కిషోర్ చంద్ర దేవ్ డిగ్రీ కళాశాలలో ఘనంగా చేగువేరా58వ వర్ధంతి.



**కురుపాం అక్టోబర్ 09 పెన్ పవర్.**కురుపాం మండలం,కిషోర్ చంద్ర దేవ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విప్లవ వీరుడు చేగువేరా 58వ వర్ధంతి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి,నివాళులర్పించారు,ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బిడ్డిక అనిల్,మాట్లాడుతూ,"చేగువేరా ఒక వ్యక్తి కాదు, ఒక ఆలోచనా విధానం.ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా దానిని ఎదిరించడమే నిజమైన మానవత్వం అని చాటి చెప్పిన గొప్ప విప్లవకారుడు చేగువేరా.డాక్టర్ గా పుట్టి,తన జీవితాన్ని పేద ప్రజల విముక్తి కోసం త్యాగం చేశాడు.నేటి విద్యార్థులు చేగువేరా స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై,ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి"అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల బాధ్యులు కొలక మల్లేష్,ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు మౌనిక,గాయత్రి,కళాశాల లెక్చరర్, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలకు తావివ్వొద్దు.....



- అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పించకుండా ఐకమత్యంతో ముందుకు సాగాలి.......
- నాతవరం మండలానికి రెండున్నరేళ్లలో రూ.72 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చాం....
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు....

**నాతవరం,పెన్ పవర్ (అక్టోబర్ 9):** గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా భావించి ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఎవరూ ఆటంకాలు కల్పించకూడదని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అందరూ సహకరించాలని ఆయన సూచించారు. శుక్రవారం నాతవరం మండలంలోని రాజుపేట అగ్రహారంలో రూ. 8.42 కోట్ల నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రోడ్డు సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు పెరగడంతో పాటు ప్రజలకు వివిధ రంగాల్లో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో నాతవరం మండలంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 72 కోట్ల నిధులను తీసుకొచ్చినట్లు అయ్యన్నపాత్రుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా చేపడుతున్నామని వివరించారు. గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, ఐకమత్యంగా పనిచేయాలని స్పీకర్ సూచించారు. గ్రామస్థాయిలో నాయకుల మధ్య సమన్వయం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలు, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి గ్రామాల ప్రగతికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకుని, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని నాయకులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సమష్టి బాధ్యత అని, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతాయని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, గన్నవరం పిఏసిఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య,మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి, నాతవరం పిఏసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు,పీకే గూడెం పి ఎస్ ఎస్ అధ్యక్షులు నాని బాబు,యువ నాయకులు గుడపర్తి అప్పలనాయుడు,రమేష్, మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్, మండల బిజెపి పార్టీ అధ్యక్షులు సబ్బి కుమార్ స్వామి,జనసేన మండల పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ,కూటమ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కోర్టు తీర్పు ఎలా ఉన్నా.. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతాం



- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం టికెట్లు కేటాయిస్తాం
- ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పష్టీకరణ

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 9 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, కోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు స్పష్టం చేశారు. గోపాలపట్నంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల రాజకీయ, సామాజిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్లు 105, 1065లను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై గణబాబు స్పందించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే న్యాయపరమైన నిబంధన నేపథ్యంలో, బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీ నివేదికతో పాటు అవసరమైన ఎంపిరికల్ డేటాను కోర్టుల ముందు ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. బీసీ మంత్రులు ఢిల్లీకి వెళ్లి సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరిపి న్యాయపోరాటం చేశారని గుర్తుచేశారు. బీసీలకు అధిక రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేసిందని వివరించారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ పునాది వేసిందని గణబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేని పరిస్థితుల్లో, దివంగత నందమూరి తారక రామారావు 1987లో పంచాయతీలు, మండల పరిషత్తులు, మున్సిపాలిటీల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు 1997లో వాటిని 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించారని చెప్పారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాలు కూడా ఈ రిజర్వేషన్లను కొనసాగించాయని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎదగడానికి ఈ నిర్ణయాలు ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు అమలులో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని గణబాబు విమర్శించారు. ఈ నిర్ణయం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికయ్యే అవకాశాలను కోల్పోయారని ఆరోపించారు. రిజర్వేషన్లను ఏ కమిటీ సిఫార్సుల మేరకు తగ్గించారు? అందుకు గల కారణాలేమిటి? అనే అంశాలపై వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల రాజకీయ హక్కులను పరిరక్షించడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2024 ఎన్నికల ప్రచారంలో, 'జయహో బీసీ' సదస్సుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగానే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గణబాబు తెలిపారు. న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్న తమ లక్ష్యంలో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. రాబోయే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున అభ్యర్థుల ఎంపికలో బీసీలకు 34 శాతం స్థానాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని, స్థానిక సంస్థల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని గణబాబు స్పష్టం చేశారు. కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా ఇచ్చిన హామీని అమలు చేసి బీసీలకు అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు.

## 16వ వార్డులో జనసేనకు వ్యతిరేకంగా రగులుతున్న నిరసన జ్వాల

**ఏకపక్ష టికెట్ నిర్ణయాలపై కూటమి నేతల భగ్గుమంట – అధిష్టానానికి చేరిన పక్కా సమాచారం**




**విశాఖ తూర్పు, పెన్ పవర్, అక్టోబర్ 9:** విశాఖ 16వ వార్డులో జనసేన తీరుపై కూటమి శ్రేణుల్లో తీవ్ర వ్యతిరేకత జ్వాలలు రేగుతున్నాయి. ఆరిలోవపై అధినాయకుల పెత్తనం, అడగకుండానే అమ్మగారికి అందలం అనే విధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని కూటమి నేతలు, స్థానిక ప్రజలు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలపై పక్కా సమాచారం ఇప్పుడు జనసేన అధిష్టానానికి చేరింది.

### అసలు జరిగింది ఏమిటి?

గత జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీ నుండి 13వ వార్డులో కొవగాపు సుశీల, కెల్లా సునీత మధ్య టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. చివరికి అప్పటి వైసీపీ అధిష్టానం కెల్లా సునీతకు టికెట్ కన్ఫర్మ్ చేసింది. టికెట్ ఆశించి భంగపడిన సుశీలను బుజ్జగించి పక్కకు తప్పించారు. ఆ రాజీ కుదిర్చిన అధినాయకులు అప్పట్లో వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్.

అనంతరం వంశీకృష్ణ శ్రీనివాస్ వైసీపీని వీడి జనసేనలో చేరి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు జనసేన జిల్లా అధ్యక్షులు హోదాలో ఉన్నారు.

### ఇప్పుడు మళ్లీ అదే సీన్ రిపీట్?

ఐదేళ్ల తర్వాత మళ్లీ జీవీఎంసీ ఎన్నికలు సమీపించడంతో 16వ వార్డులో అదే తీరు పునరావృతం అవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ ఎన్నికల సీట్ల సర్దుబాటులో 16వ వార్డుపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీ హయాంలో టికెట్ కోల్పోయిన కొవగాపు సుశీల కుమార్తె పావనిని ఇప్పుడు జనసేన తరపున 16వ వార్డు అభ్యర్థిగా బరిలోకి దించేందుకు పావులు కదుపుతున్నారనే పక్కా సమాచారం కూటమి వర్గాల్లో కలకలం రేపుతోంది.వైసీపీ హయాంలో జరిగిన సర్దుబాట్లు, పొరపాట్లను వైసీపీ వారే చక్కదిద్దుకోవాలి కానీ, వైసీపీ కుటుంబానికి చెందిన వ్యక్తికి జనసేన టికెట్ కేటాయించడం ఏమిటని కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు.

### పార్టీని, కూటమిని సంప్రదించలేదు – ఇదీ అసలు నిరసన

పార్టీ వార్డు నాయకులను, స్థానిక టీడీపీ, కూటమి నాయకులను, కార్యకర్తలను ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై కూటమి శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఇది పవన్ కళ్యాణ్ ఆశయాలకు విరుద్ధమని, వ్యక్తిగత స్వలాభం కోసం తీసుకున్న నిర్ణయమని వారు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నారు.

### కూటమిలో రగులుతున్న అసమ్మతి – జనసేనకు గెలుపు సాధ్యమేనా?

టీడీపీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏనాడూ గెలుపు ఎరుగని అప్పటి వార్డులు 23, 1, 13. ఈ ఎన్నికలలో 16 వ వార్డులలో సైతం కష్టపడి ఈసారి టీడీపీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలు ధ్యేయంగా పెట్టుకున్న సమయంలో జనసేన ఏకపక్ష నిర్ణయం తలనొప్పిగా మారింది.వార్డు టికెట్ టీడీపీకి కేటాయిస్తే ఫర్వాలేదు, లేకపోతే జనసేనకు సహకరించేది లేదని టీడీపీ నాయకత్వం తెగేసి చెబుతోంది. టీడీపీ నుండి రెబల్ అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశం ఉందని, కూటమి నేతలు సహకరించకపోతే జనసేనకు ఓటమి తప్పదని స్థానికంగా చర్చ జరుగుతోంది.ఈ పరిణామాల ప్రభావం కేవలం కార్పొరేటర్ ఎన్నికలపైనే కాదు, రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే భవిష్యత్తుపైనా తీవ్రంగా పడుతుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రజలను, కార్యకర్తలను పక్కన పెట్టి తీసుకున్న నిర్ణయంతో 16వ వార్డులో జనసేనకు గెలుపు అసాధ్యమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.అధిష్టానానికి విజ్ఞప్తి: స్థానిక నాయకులను, కూటమి శ్రేణులను సంప్రదించి, గ్రౌండ్ రియాలిటీ తెలుసుకొని టికెట్ కేటాయించాలని, లేకపోతే 16వ వార్డులో కూటమికే నష్టం జరుగుతుందని ప్రజలు, కార్యకర్తలు జనసేన అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## అల్లూరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి.

సిపిఐ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు బారేపల్లి వెంకటరమణ.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.** సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం చింతపల్లి మండలం టేకుల వీధి లో శుక్రవారం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి పెట్ల పోతురాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరు జిల్లా కార్యదర్శి పి. సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో కరువు జిల్లాగా ప్రకటించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిపిఐ పార్టీ శ్రేణులు అందరూ స్థానిక సంస్థ ల ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలో ఎంపీటీసీ సర్పంచ్ స్థానాల నుంచి బలమైన అభ్యర్థులందరినీ బరిలోకి దించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ వార్డు సభ్యుల నుంచి ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యుల వరకు ఒక నివేదిక తయారు చేయాలని కార్యవర్గ సభ్యులందరికీ సూచించారు ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులతో పాటు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల నగారాకు సన్నాహాలు.బ్యాలెట్ బాక్సులు రెడీ.

- ఏపీఆర్ కళాశాలలో బాక్సులను తనిఖీ చేసిన ఎంపీడీవో లాలం సీతయ్య.
- శుభ్రం చేయించి ఎంపీడీవో కార్యాలయానికి తరలింపు.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు సన్నాహక చర్యలను వేగవంతం చేసింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసే క్రమంలో భాగంగా చింతపల్లిలోని బ్యాలెట్ బాక్సుల పరిశీలన శుక్రవారం చేపట్టారు. స్థానిక ఏపీఆర్ కళాశాల ప్రాంగణంలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాలం సీతయ్య సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీర్ఘకాలంగా నిల్వ ఉండటంతో బాక్సుల తాళాలు, మూతలు, వాటి భద్రతా స్థితిగతులను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది సహకారంతో బ్యాలెట్ బాక్సులపై పేరుకుపోయిన దుమ్ము, తుప్పును శుభ్రం చేయించి, వినియోగానికి సిద్ధం చేశారు. అన్ని బాక్సులు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాత, వాటన్నింటినీ సురక్షితంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి తరలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకుంటున్నామని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఎన్టీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 09** జీవీఎంసీ పాత 66 కొత్త 90 వార్డ్ లో సుమారు 40 లక్షలు రూపాయలు తో సీతారాం నగర్ కైలాష్ నగర్ ప్రాంతంలో సిసి రోడ్లు సిసి డ్రైన్లకు ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు . కార్యక్రమంలో 66 వార్డు తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ వార్డు ఇన్చార్జి మహమ్మద్ రఫీ ,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్ష ,కార్యదర్శులు గోమాడ వాసు ,ఎండి ముర్తాజ, వార్డు జనసేన అధ్యక్షుడు పోలారవుతూ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ లంకలత, జీవీఎంసీ డిఇ వెంకట్రావు ,వర్క్ ఇన్స్పెక్టర్ గంగరాజు మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాం భాయ్ , క్లస్టర్ ఇంచార్జ్ , తాడి వరలక్ష్మి ,ఆశ, సరోజినీ, లతా, కోరుకొండ పద్మ, స్వర్ణపుడి సత్యనారాయణ, పెంటకోట పవన్ కుమార్, నంబాల రమణ, స్థానిక నాయకులు శ్రీను ,కుర్మారావు ,శంకర్రావు, వాసంశెట్టి శ్రీను, కార్తీక్, వెంకటరమణ, ఎలమంచిలి పైడ్రాజు ,మరియు కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# విశాఖ ఎన్నికల చూపు... రిజర్వేషన్ల వైపు!

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, అక్టోబర్ 9:** మహా విశాఖ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియలో రిజర్వేషన్ల ఖరారు కీలక దశగా మారింది. ఒకవైపు 120 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేస్తుండగా, మరోవైపు బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తాజా నిర్ణయం నేపథ్యంలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై దృష్టి కేంద్రీకృతమైంది. వార్డుల రిజర్వేషన్లు, మేయర్ పదవి కేటగిరీ ఖరారైతే అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య సీట్ల పంపకంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసిన తర్వాత రాజకీయ పార్టీలతో సమావేశమై ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. దీంతో ఎన్నికల సన్నద్ధత కొనసాగుతున్నప్పటికీ, తుది షెడ్యూల్‌కు ముందు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది.

**బీసీ రిజర్వేషన్లపై కీలక న్యాయ పరిణామం**

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల వ్యవహారంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. హైకోర్టు సహేతుకమైన నిర్ణయం తీసుకుందని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల కోటాల మధ్య తేడా ఉంది. గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన జీఓ 105లో బీసీ కోటా 34 శాతం కాగా, పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన జీఓ 1065లో 33.33 శాతంగా పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం వర్టికల్ రిజర్వేషన్లు 50 శాతాన్ని మించే మేరకు ఆ ఉత్తర్వులు నిలవవని హైకోర్టు నిర్ణయించింది. ఈ పరిణామాన్ని బీసీ రిజర్వేషన్లన్నింటినీ తొలగించినట్లుగా భావించరాదు. జీవీఎంసీలో ఏ వార్డు ఏ వర్గానికి కేటాయిస్తారనేది తుది అధికారిక నోటిఫికేషన్‌తోనే తేలనుంది.

**ఓటర్ల జాబితా సవరణతో ఎన్నికలకు ఆలస్యం వద్దు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ---ఎస్ఐఆర్--- పూర్తికాలేదనే కారణంతో స్థానిక ఎన్నికలను ఆలస్యం చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు సవరించిన జాబితాలు ప్రచురితం కాకపోతే ప్రస్తుతం అమల్లో ఉన్న జాబితాలతో ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది.

**98 నుంచి 120 వార్డులు... మారిన ఎన్నికల స్వరూపం**

జీవీఎంసీ వార్డులను 98 నుంచి 120కి పెంచుతూ పునర్విభజన ఖరారైంది. కొత్త వార్డు సరిహద్దులు రాబోయే ఎన్నికల పోటీకి ప్రాతిపదిక కానున్నాయి. అయితే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల కేటాయింపు వేర్వేరు ప్రక్రియలు. వార్డు సంఖ్య, సరిహద్దులు ఖరారయ్యాయి కానీ, రిజర్వేషన్ లు ఇంకా నిర్ణయించలేదు.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి నగరానికి చేరగా, పంపిణీ--కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. భద్రత, విద్యుత్ సరఫరా, సిబ్బంది రాకపోకలు తదితర అంశాల్లో ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు.

**ప్రత్యక్ష మేయర్ ఎన్నికతో నగరవ్యాప్త పోటీ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త నియమాల ప్రకారం మేయర్‌ను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోనున్నారు. దీంతో వార్డు అభ్యర్థులతోపాటు నగరవ్యాప్తంగా ఓటర్ల మద్దతు పొందగల మేయర్ అభ్యర్థి ఎంపిక కూడా పార్టీలకు కీలకం కానుంది.

**కూటమి సమన్వయం... టికెట్ల లెక్కలు తేలాల్సిందే**

టీడీపీ--జనసేన--బీజేపీ నేతలు జీవీఎంసీ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని ఇప్పటికే ప్రకటించారు. మేయర్ అభ్యర్థిని మూడు పార్టీల అగ్రనేతలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. అయితే ఏ పార్టీకి ఎన్ని వార్డులు, ఏ స్థానంలో ఎవరు పోటీచేస్తారనే తుది పంపకంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదే సమయంలో బీసీలకు పార్టీ పరంగానైనా 34 శాతం అవకాశాలు కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు కూడా తెలిపారు. పార్టీల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన రాజకీయ హామీ. కూటమి సీట్ల పంపకంలో ఈ విధానాన్ని ఎలా అమలు చేస్తారనే అంశంపై ఇంకా స్పష్టత అవసరం.

**ప్రభుత్వ తదుపరి నిర్ణయమే కీలకం**

స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చించేందుకు అక్టోబర్ 10న రాష్ట్ర మంత్రివర్గం అత్యవసరంగా సమావేశం కానున్నట్లు సమాచారం. అయితే సమావేశ అధికారిక అజెండా ధ్రువీకరణకు రావాల్సి ఉంది. పట్టణ స్థానిక సంస్థలకు ఒకే దశలో, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించి, నోటిఫికేషన్ తర్వాత 15 రోజుల్లో ప్రక్రియ పూర్తిచేసేలా ముందస్తు ప్రణాళికలు సాగుతున్నాయి. జీవీఎంసీ పోలింగ్, నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, ఓట్ల లెక్కింపు తేదీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించే షెడ్యూలే ప్రామాణికం. రిజర్వేషన్ల గెజిట్, ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్---విశాఖ ఎన్నికల పోరులో ఇప్పుడు ఈ రెండు అధికారిక ప్రకటనలే కీలకంగా నిలిచాయి.

## సమాన పనికి సమాన వేతనం ఎక్కడ..? కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలి.



వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల భద్రత కోసం పోరాటనికి సంపూర్ణ మద్దతు :

నిరుద్యోగులు సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు కర్జ.వైకుమార్

**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 09:** అల్లూరి జిల్లా ప్రధాన కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని గత నాలుగు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చీమకుట్టినట్టు కూడా లేని పరిస్థితి కనిపిస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత అధికారులు చేస్తున్న ప్రకటనలను ఉద్యోగస్తుల తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి, ప్రపంచ దేశాలంతా కరోనా మహమ్మారి అల్లా కల్లోలం సృష్టిస్తున్న పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కోట్లాదిమంది ప్రజలకు సేవలందించిన ఫ్రంట్ లైన్ వారియన్స్. వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, రేడియోగ్రాఫర్స్, ఫార్మసిస్టులు ఇతర పారామెడికల్ సిబ్బందిని క్రమబదించాలని వైకుమార్ డిమాండ్ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్య పరిష్కారం అయ్యేవరకు ఉద్యమ ఉధృతం చేయడం జరుగుతుందనీ వారి ఉద్యమానికి మేము సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ గంపరాయి రాంబాబు మరియు సురేష్, టక్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 26 వేల వేతనం కోసం పోర్ట్ గెస్ట్ హౌస్ కార్మికుల గర్జన



- కాంట్రాక్టర్ వేధింపులపై సీఐటీయూ ఆగ్రహం..
- పిఎఫ్ , ఈ ఎస్ ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 9:** అరకులోని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ గెస్ట్ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం పోర్ట్ గెస్ట్ హౌస్ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ అరకు వ్యాలీ మండల కన్వీనర్ జె. భగత్ రామ్ మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులు, గార్డెనర్ కార్మికులు సుమారు 13 ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానంలో తక్కువ వేతనాలతో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు కార్మికులకు చట్టబద్ధంగా అందాల్సిన వేతనాల్లో కోతలు విధిస్తూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. గిరిజన కార్మికులపై బెదిరింపులా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన కాంట్రాక్టర్ స్థానిక గిరిజన కార్మికులను చులకనగా చూస్తూ తక్కువ వేతనాలకు పనిచేయాలని, లేదంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. కార్మికులపై ఒత్తిళ్లు, బెదిరింపులు నిలిపివేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం 26,000 చెల్లించాలని, పీఎఫ్ , ఈఎస్ఐ, సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి, బకాయి వేతనాలు ఉంటే వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై పోర్ట్ యాజమాన్యం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటి కన్వీనర్ భగత్ రామ్, మండల సిఐటియు కమిటీ, కార్మికుడు కోగేశ్వరరావు. తదితులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికే ఐడి కార్డులు పంపిణీ...!

వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు "బిడిజన అప్పారావు"

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 9:** వైఎస్ఆర్సిపి కార్యకర్తలు సంక్షేమం కోసమే అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఐడి కార్డులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు బిడిజిన అప్పారావు తెలిపారు. శుక్రవారం మండలంలో డౌనూరు పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐడి కార్డులను అల్లూరి జిల్లా అధ్యక్షుడు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ పొట్టిక భవాని ఆధ్వర్యంలో కార్యకర్తలకు అందజేశారు. అనంతరం బిడిజన అప్పారావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని ప్రజల్లోకి వెళ్లి రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ స్థానిక ఎన్నికలకు వైయస్సార్ పార్టీ శ్రేణులు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం సర్పంచ్ ఎంపీటీసీలు అభ్యర్థిగా ఎవరికి అవకాశం కల్పించిన నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి వైయస్సార్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో



గెలిపించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఐడి కార్డులు పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సభ్యులు పొట్టిక పోతురాజు రాష్ట్ర ఐటీ విభాగం సభ్యులు నేలాపు సూరిబాబు మండల పార్టీ కార్యదర్శి పేట్ల గాంధీ, డౌనూరు మాజీ సర్పంచ్ ఆగూరి జోగురాజు వైసిపి పార్టీ సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు బాలరాజు ఉల్లి రామ్మూర్తి, డేవిడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడా లక్ష్మి జంప బోడకొండ అరవింద్ సంజీవ్, రాంబాబు పాంగి నాగరాజు, వంతల అర్జున్, పాంగి రాజబాబు, సత్యనారాయణ, రాజ్ కుమార్, దేవుడమ్మ, సత్యవతి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఏబులంలో పొలంబడి కార్యక్రమం

- వరి సాగులో అధిక దిగుబడులు, నాణ్యమైన ధాన్యం ఉత్పత్తిపై రైతులకు అవగాహన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 9:** రైతులు వరి సాగులో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన ధాన్యాన్ని ఉత్పత్తి చేసే విధానాలపై అవగాహన కల్పించేందుకు గూడెంకొత్తవీధి మండలం ఏబులం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సురేష్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేష్ బాబు మాట్లాడుతూ వరి సాగులో సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం ఎంతో కీలకమని వివరించారు. వరి పంటలో బూటింగ్, కంకి బయటకు వచ్చే హెడింగ్ దశల్లో మొక్కలకు అవసరమైన పోషకాలను అందించాలని సూచించారు. ముఖ్యంగా పొటాష్ ఎరువు ప్రాధాన్యత, ధాన్యం గింజలు నిండే దశలో దాని పాత్రను రైతులకు వివరించారు. పొటాష్ లోప లక్షణాలను గుర్తించి, తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరి పంట పుష్పించే దశలో పొలంలో తగిన నీటి మట్టాన్ని నిర్వహించడం ద్వారా పంటపై ఒత్తిడి తగ్గి, ధాన్యం నాణ్యతతో పాటు దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. పంట ఎదుగుదల దశలను బట్టి నీటి నిర్వహణ చేపట్టడంతో పాటు సమతుల్య ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సింహాచలం, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది గణేష్, రైతులు సత్తిబాబు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లకు టిడిపితో సాధ్యం



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 09 :** తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక వారికి స్థానిక సంస్థ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు . పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు . గొడ్డలి పార్టీ చేస్తున్న బీసీ వ్యతిరేక చర్యలు ఎండగట్టారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గొడ్డలి పార్టీది బీసీల పైన కపట ప్రేమని తమ అనుచరులతో కోర్టుల్లో కేసులు వేయిస్తూ బీసీల హక్కులను కాల రాస్తుందని అన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీలపరంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల ఉన్న అపారమైన ప్రేమాభిమానాల్ని చాటుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో గాజువాక నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తమరి శివప్రసాద్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సింగూర్ అనంత్ ,పల్లా రమణ, బైపిల్లి గాంధీ,పోతిన వెంకట్రావు, దొడ్డి సత్య రావు, వెల్లూరి శివప్రసాద్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమలో రూ.39.45 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం-దోబీ ఘాట్, బాక్స్ కల్వర్టు, సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 9 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. నియోజకవర్గంలోని 92వ వార్డులో మొత్తం రూ. 39.45 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. పద్మనాభ నగర్, జనతా కాలనీలలో రూ. 19.65 లక్షల వ్యయంతో నిర్మించిన దోబీ ఘాట్‌ను గణబాబు ప్రారంభించారు. అలాగే నందమూరి నగర్‌లోని మసీదు పక్కన నిర్మించిన బాక్స్ కల్వర్టు, సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలగడంతో పాటు, దోబీ వృత్తిపై ఆధారపడిన వారికి అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పేదలు, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులు, ఇతర ప్రజావసరాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని కాలనీలు, శివారు ప్రాంతాల్లో ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి నందవరపు సోములు, జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రజక సంఘ



ప్రతినిధులు, ముస్లిం సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డి. అన్నవరంలో 'మీ భూమి' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

రైతుల భూ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 9:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని డి. అన్నవరం గ్రామంలో రైతులకు 'మీ భూమి' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారి తగ్గి రామారావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలమజ్జి, సర్వేయర్ ఆదినారాయణ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే, భూ పరిపాలన సంస్కరణల్లో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూ హక్కుల పరిరక్షణకు, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

**భూ వివరాల నమోదులో ఆధునిక సాంకేతికత:**

రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తలెత్తకుండా భూముల వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు చేస్తున్నట్లు వివరించారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా భూములకు సంబంధించిన వివరాలను భద్రపరచుకోవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్, జీపీఎస్ వంటి సాంకేతిక సదుపాయాల వినియోగంతో భూ వివరాలు, సరిహద్దుల గుర్తింపునకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వంటి డిజిటల్ సేవల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**పాస్ పుస్తకాలు అందడంతో రైతుల్లో ఆనందం:**

పట్టాదారు పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తమ భూములకు సంబంధించిన హక్కుల పత్రాలు అందజేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షుడు చెర్రికి బాలరాజు, జనసేన నాయకుడు సిదేరి రమణమూర్తి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలమజ్జి, మండల సర్వేయర్ ఆదినారాయణ మజ్జి, గ్రామ రెవెన్యూ అధికారి తగ్గి రామారావు, గ్రామ సర్వేయర్ గబులంగి బుజ్జిబాబు, పట్టాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## "పనసలపాడు" లో కుసుమ సాగుపై "రైతులకు" అవగాహన

మండల వ్యవసాయ అధికారి "పి శివరాం ప్రసాద్"



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 9 :** రబి సీజన్లో మండలంలో కొత్తగా 50 ఎకరాల్లో కుసుమ సాగు చేపడుతున్న నేపథ్యంలో పనసలపాడులో రైతులకు ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి పి శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ ఏ ఆర్ ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ సందీప్ నాయక్ హాజరై రైతులకు కుసుమ పంట సాగుపై మెలుకువలు తెలియజేశారని అన్నారు. అనంతరం శాస్త్రవేత్త సందీప్ నాయక్ మాట్లాడుతూ కుసుమ విత్తనం నాటినప్పటి నుండి పంట కోత వరకు క్రమం తప్పకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతి 30 రోజులకు ఒకసారి పంట పొలాలను సందర్శించి తగిన సలహాలు రైతులకు అందిస్తామని తెలియజేశారు. ముఖ్యంగా ఎంపిక చేసిన రైతులకు వంద శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ అవగాహన సదస్సులో గ్రామ ఉద్యాన అధికారి జి హెచ్ ఓ సంధ్య, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పొడుగు మోహనరావు, పెసా కార్యదర్శి కొర్రలు బంగారయ్య, మాజీ సర్పంచ్ కోడా చిన్న తల్లి, రాజబాబు, రైతులు సత్యనారాయణ లోతా పద్మ శ్రీనివాసు, దుచ్చరి జోగారావు, నేగుల దేవుడు,పోత్తూరు రాజబాబు, నేలపు రాజబాబు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జనసేన 91వ వార్డు ఆత్మీయ సమావేశానికి పోటెత్తిన జనం

- స్థానిక ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యత క ల్పించాలి.....



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 09**

విశాఖ జిల్లా గాజువాక లో నూతనంగా ఏర్పడిన 91వ వార్డు లో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం వార్డు ఇంచార్జి,రాష్ట్ర మత్స్యకార విభాగం వైస్ చైర్మన్ రెయ్యి రత్నం ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి మహిళలు,యువకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రజలకు సేవ చేయడంలో జనసేన పార్టీ లక్ష్యాలు,రానున్న ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం రెయ్యి రత్నం మీడియాతో మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని,యువత పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించడం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.2019 నుంచి పార్టీలో కొనసాగుతున్న తనకు 2021 గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం కల్పించారని,అయితే స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందానని అయినప్పటికీ ఆ నాటి నుంచి పార్టీ బలోపేతంలో చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నట్లు తెలిపారు.మత్స్యకార మహిళగా ఈసారి ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించేలా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ల సారధ్యంలో రాష్ట్రంలో పారదర్శకంగా పాలన సాగుతోందని,వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా ఆ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.వార్డుల్లోని పార్టీ కార్యకర్తలు,మత్స్యకారులతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అభిమానుల రాకతో కల్యాణ మండపం కిక్కిరిసిపోయింది.ఈ సమావేశంలో గ్రామ పెద్దలు తెప్పల అప్పారావు,జనసేన నాయకులు సడే రామారావు,కృష్ణ,హైమావతి,సౌజన్య,కనక,నీలయ్య,అనిల్,నరేంద్ర, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌డ్యామ్ కొట్టుకుపోయి.. సాగునీటికి రైతుల పాట్లు!



- మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలి
- కలెక్టర్ దృష్టికి దేవరపల్లి గ్రామస్తుల సమస్య

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలో వాయుగుండం ప్రభావంతో దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యను శుక్రవారం జిల్లా కలెక్టర్ టి. నిశాంతి దృష్టికి తీసుకెళ్లి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 21 నుంచి 26 వరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ చెక్‌డ్యామ్‌పై ఆధారపడిన సుమారు 1,000 మంది రైతులకు చెందిన 2,500 ఎకరాల వ్యవసాయ భూములకు నీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.దేవరపల్లి, మంగళపాలెం దిగువ కట్టువీధి, బొడ్డుమామిడి గ్రామాల రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చెక్‌డ్యామ్ దెబ్బతినడంతో వ్యవసాయంపై ఆధారపడిన రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలిపారు.జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, చెక్‌డ్యామ్ పునర్నిర్మాణం లేదా అవసరమైన మరమ్మతుల సాధ్యాసాధ్యాలను అంచనా వేయాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసి, చెక్‌డ్యామ్‌ను పునరుద్ధరించడంతో పాటు మినీ రిజర్వాయర్ నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు, మాజీ సర్పంచులు దేవరాజు రామచంద్రరాజు, దేవరాజు పద్మ, సాగిన శంకరరావు, సాగిన పార్వతమ్మ, దేవరాజు పెద్దమ్మ, లకే బాలరాజు, లకే కొండమ్మ, లకే రాములమ్మ, దేవరాజు ఉదయ్ భాస్కర్ రాజుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి.

- చౌడుపల్లి గ్రంథాలయంలో ఘనంగా ప్రేరణాత్మక సదస్సు.
- యువతకు స్ఫూర్తి... భవితకు మార్గదర్శకం



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.**యువతలో నూతనోత్సాహాన్ని నింపుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో చౌడుపల్లి గ్రామ గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రేరణాత్మక (మోటివేషనల్) సదస్సు విజయవంతంగా ముగిసింది. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన దిశానిర్దేశం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు విద్యార్థులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తూ ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. చరిత్ర ప్రాధాన్యతను వివరిస్తూనే, దృఢ సంకల్పం, పట్టుదలతో శ్రమిస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని స్పష్టం చేశారు. ఆయన అనుసరించిన బోధనా శైలి, స్ఫూర్తిదాయకమైన మాటలు సభికులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా యువతలో నూతన ఆలోచనలకు, ఆత్మవిశ్వాసానికి బాటలు వేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సన్యాసిరావు, ఎల్.ఎఫ్.ఎల్. హెచ్.ఎం. ఎస్.బి.జి. తిలక్, హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు తమ వంతు మార్గదర్శకత్వాన్ని, విలువైన సూచనలను అందించారు. గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారికి సరైన వేదికను కల్పించిన చౌడుపల్లి గ్రామ గ్రంథాలయ అధ్యక్షులు ఉగ్రంగి వెంకట రవి ప్రసాద్ కి ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లోనూ గ్రామంలో మరిన్ని కెరీర్ గైడెన్స్ సెషన్లు, పోటీ పరీక్షల ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, గ్రామ యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ నవరాత్రులు మరియు దసరా మహోత్సవలకు ఏర్పాట్లు





**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 09:**శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ నవరాత్రులు మరియు దసరా మహోత్సవలను పురస్కరించుకొని మెగా వాలీబాల్ టోర్నమెంట్ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు తెలిపారు.... ఆయన మీడియాతో మాట్లాడుతూ...జీప్ యూనియన్ , మరియు ఆటో యూనియన్ సౌజన్యంతో నిర్వహిస్తున్నమనీ అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రొబ్బి రాము, డొంకిని నాగు, గబంగి ప్రసాద్ మాట్లాడుతూ .... ఈ టోర్నమెంట్ ఈనెల 18 నుంచి ప్రారంభం కానుందనీ ఆసక్తి కలిగినటువంటి వారు ఈనెల 15 లోపు తమ టీమ్ పేర్లు నమోదు చేసుకావాలని అన్నారు మరిన్ని వివరాలు కొరకు ఈ క్రింద ఫోన్ నెంబర్ లకు 9493639596,8985081181,6303960038,8331920870,9441944342 సంప్రదించగలరనీ, ఈ టోర్నమెంట్ లో పురుషు, మరియు మహిళల క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విజేతలకు మొదట బహుమతి రూ 25000, రెండో బహుమతి రూ 10000 వేలు, మూడో బహుమతి రూ 5000 చొప్పున ఇవ్వనునట్లు ప్రకటించారు. ఈ టోర్నమెంట్ పెద్దలు పర్యవేక్షణలో అండర్ 19 కోచ్ మహేష్ , సూరిబాబు , సింహాచలం మాస్టర్ , భూపతి మాస్టర్ , అమృతవాస్ మాస్టర్, భూషణ్ మాస్టర్, సీతారాం మాస్టర్ నిర్వహిస్తున్నారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో పెసా సెక్రెటరీ కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఆటో బుజ్జి, అప్పారావు, వియ్యపు వెంకట్, నాగరాజు, వి హరి, కొండ మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కుసులవాడకు చెందిన యర్ర వసంత ఎంపిక



**ఆనందపురం,పెన్ పవర్ అక్టోబర్ 9 :**మండలం లోని కుసులవాడకు చెందిన యర్ర వసంత రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 26న కైట్స్ నోబెల్ పాఠశాల మైదానంలో నిర్వహించిన సీనియర్ జిల్లా స్థాయి షూటింగ్ బాల్ బాలబాలికల ఎంపిక పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అక్టోబర్ 11, 12 తేదీల్లో గుంటూరు జిల్లా బీఎస్ఎస్బీ జూనియర్ కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వసంత ప్రాతినిధ్యం వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు యర్ర శివాజీ తెలిపారు

## వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మద్దతు



### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

### కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 09:**వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి ఆమె హాజరై ఉద్యోగులకు మద్దతు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కాంట్రాక్టు ఉద్యోగులకు పూర్తిస్థాయి అండగా ఉంటామని ప్రకటించారు.ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ఏరియా ఆసుపత్రులతో పాటు జిల్లా ఆసుపత్రిలో సుమారు 600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరిలో స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది, ఫార్మాసిస్టులు 16 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడం, మందులు అందజేయడం, సకాలంలో రక్త పరీక్షలు నిర్వహించడం వంటి కీలక విధులను కాంట్రాక్టు సిబ్బంది నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వారి సేవలనువినియోగించుకుంటున్న ప్రభుత్వం, పనికి తగిన వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు పనికి తగిన వేతనాలు చెల్లించాలని భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రజారోగ్య సేవలకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి తమ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## అథ్లెటిక్స్‌లో గుల్లేలి చంద్రశేఖర్ నాయుడుకు బంగారు పతకం

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 9**: కర్నూలు జిల్లాలో నిర్వహించిన 41వ ఆంధ్ర రాష్ట్ర అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థి గుల్లేలి చంద్రశేఖర్ నాయుడు బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు కర్నూలు జిల్లాలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-16 విభాగంలో చంద్రశేఖర్ నాయుడు షాట్‌పుట్ పోటీలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో అక్టోబర్ 23 నుంచి 26వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.ప్రస్తుతం 11వ తరగతి చదువుతున్న చంద్రశేఖర్ నాయుడు సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ రమణరావు,పిఈటి అరుణ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని అభినందించి, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తోటి విద్యార్థులు సైతం చంద్రశేఖర్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యాశాఖాధికారి -2 గా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 09.** ముంచంగిపుట్టు మండల విద్యాశాఖ అధికారి- 2 గా గొల్లోరి సూర్యనారాయణ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల విద్యాశాఖాధికారి -2 గా పని చేసి రిటైర్మెంట్ అయిన బి త్రినాధరావు తరువాత మండల విద్యాశాఖాధికారి -2 పోస్ట్ ఖాళీ ఏర్పడింది. గత రెండు నెలలుగా ఎంఈఓ-2 పోస్ట్ ఖాళీగా ఉన్నది. రీజినల్ జాయింట్ డైరెక్టర్ వారి ఆదేశానుసారముగా మండల పరిషత్ పాఠశాల బంగారుపుట్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న గొల్లోరి సూర్యనారాయణకు అదనపు మండల విద్యాశా కాధికారి -2 గా నియమించారు. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖాధికారి -2 గా గొల్లోరి సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. అందరి ప్రోత్సాహం, ఆశీస్సులు తనకు ఎంతో స్పూర్తినిచ్చాయనీ, తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను పూర్తి చిత్తశుద్ధితో, విద్యా వ్యవస్థను అభివృద్ధి పదంలో నడిపించుటకు కృషి చేస్తానని అన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు సహకారంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. తనకు అభినందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కోడా కృష్ణమూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిఆర్పిలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.ద

## వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వరరాజు డిమాండ్



**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 09:** వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం పాడేరు జిల్లా కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన నాలుగో రోజు ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించి, ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు.. కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. తమ పార్టీ శ్రేణులతో కలిసి మరుసటి రోజు నుంచి నిరసన దీక్షలో పాల్గొంటామని ప్రకటించారు.సుదీర్ఘకాలంగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని ఆయన కోరారు. ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యార్థి నేతల అరెస్టు అప్రజాస్వామికం.

- తక్షణమే విడుదల చేయాలి.
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.** పాడేరు జిల్లా కేంద్రంలో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. అరెస్టయిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ పాడేరులో తలపెట్టిన శాంతియుత ర్యాలీకి వెళు _న్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జీవన్, కార్తీక్, కృష్ణలతో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకుడు కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను, నిరసన తెలిపే హక్కును కాలరాయడం దుర్మార్గమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రద్దయిన 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని, ఓట్ల గల్లంతుకు నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న విద్యార్థి నాయకులపై తప్పుడు కేసులు బనాయించి అణచివేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరెస్టయిన నేతలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజా, విద్యార్థి సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ని భర్తరఫ్ చేయాలి.....



- "సర్ "ను రద్దు చేయాలి
- ఇండియా కూటమి నేతల డిమాండ్!
- పార్వతీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన....

**పార్వతీపురం మన్యం పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 9:** ప్రజాస్వామ్య దేశంలో ఓటర్ల నమ్మకాన్ని ఎన్నికల కమిషన్ పొందాలని అలాంటిది ప్రజల నమ్మకాన్ని కోల్పోయే విధముగా భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ వ్యవహరించారని ఇండియా కూటమి పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.. శుక్రవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, నాయకులు మాట్లాడుతూ... ప్రత్యేక ఓటర్ల పరిశీలన పేరుతో దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ప్రమాదకరమైన విషయమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది అత్యంత ముఖ్యమైన ప్రజాస్వామ్య హక్కని, ఓటు హక్కును కొంతమందికి, కొన్ని వర్గాల ప్రజలకు తొలగించేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని అందులో భాగంగానే స్వతంత్ర వ్యవస్థగా ఉండాల్సిన ఎన్నికల కమిషన్ లో రాజకీయ జోక్యం పెరిగిందని,దానికి వూతమిచ్చే విధంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారని, విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ లో మెజారిటీ ఎన్నికల కమిషనర్ ల అభిప్రాయమే నిర్ణయంగా ప్రకటించాలని రాజ్యాంగం నిర్దేశిస్తుంటే అలా కాకుండా మెజారిటీ ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకించిన అంశాలను కూడా ప్రజలపై నిర్ణయాలు గా రుద్దడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు? ఇప్పటికైనా సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంను ఆదేశించి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్ ను రద్దు చేయాలనీ లేనియెడల దేశ వ్యాప్తంగా కాంగ్రెస్,వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాలను, ఇతర రాజకీయ పక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటు పడతామని ఈ సందర్భంగా తెలిపారు..

అంతకు ముందు ఆర్ టి సి కాంప్లెక్స్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు....

ఈ కార్యక్రమంలో లికాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు పార్వతీపురం నియోజక వర్గ ఇంచార్జీ బత్తిన మోహన్ రావు, సాలూరు నియోజకవర్గం ఇన్ ఛార్జ్ గేదెల రామకృష్ణ, కురుపాం ఇన్ ఛార్జ అడ్డాకుల చిన్నారావు, సిగడం బంగారయ్య,పాలక రంజిత్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధ రావు , జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వి ఎస్ కుమార్, సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ,బంకురు సూరిబాబు, బొత్స లక్ష్మి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోలా ఈశ్వరావు, లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సంగం, రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట జీవ, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బీ టి నాయుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాయకులు తీళ్ళ గౌరీ శంకర్ రావు, జాగాన భాస్కర్ రావు, మీసాల ఫ్రాన్సిస్, కోలక జయరాం తదితరులు పాల్గొన్నారు....

## జిల్లాలోనే ప్రథమంగా ప్రజలకు అందుబాటులోకి ఆధార్ సేవా కేంద్రం



- సుదూర ప్రాంతాల వారికోసం ఆదివారాల్లో కూడా ప్రజా సేవలు లభ్యం
- పాడేరు నక్కపూట్టు గ్రామంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన
- జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 09 :** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు మండలం, నక్కలపూట్టు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆధార్ సేవా కేంద్రం' ను శు క్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమాని శ్రీపూజ ఘనంగా రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖ×ణూ× డిప్యూటీ డైరెక్టర్, బిఎల్ఎస్ (బి ఎల్ ఎస్) ఏజెన్సీ మేనేజర్లతో పాటు నూతన సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమన్ని ఉద్దేశించి

జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలి ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో రాష్ట్రంలో కేవలం కొన్ని ప్రధాన నగరాలు, జిల్లాలకే పరిమితమైన ఆధార్ సేవా కేంద్రాలను ప్రస్తుతం అన్ని జిల్లాలకీ విస్తరిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొదటిసారిగా పాడేరులోని నక్కల పుట్టు గ్రామంలో ఈ కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆధార్ మార్పులు, చేర్పులు చేసుకోలేక దీర్ఘకాలిక సమస్యలకు స్వస్తి చెప్పి, ఆధార్ కేంద్రాలను ప్రతి జిల్లాకు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆధార్ ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంక్ సేవలు, ప్రత్యక్ష నగదు బదిలీలన్నింటికీ ఆధార్ అత్యంత కీలక ప్రామాణికంగా మారిందని, ప్రతి పనికి ఆధారం ఉంటేనే గాని ఏ పని జరిగిన పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో జిల్లా ప్రధాన కేంద్రంలో ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పేరు, పుట్టిన తేదీ (ఙాదీ), వయస్సు, తల్లిదండ్రుల వివరాలలో మార్పులు, చేర్పులు ఇతర సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్థానిక గిరిజన ప్రజలకు ఈ కేంద్రం ద్వారా త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

### ప్రత్యేక గ్రీవెన్స్ కౌంటర్

ప్రజలు తమ ఆధార్ వినతులను నమోదు చేసుకోవడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కేంద్రంలో ప్రత్యేకంగా 'గ్రీవెన్స్ కౌంటర్' ఏర్పాటు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జోనల్, రీజినల్ కార్యాలయాలకు ఎస్కలేట్ చేసి త్వరితగతిన క్లియర్ చేసేలా చర్యలు ఉంటాయన్నారు.

### ఆదివారం కూడా ఆధార్ సేవలు అందుబాటులో

ఈ ఆధార్ సెంటర్ వల్ల ఆదివారం రోజున ఉద్యోగులు, సుధీర ప్రాంతం నుండి వచ్చే వారికి, దినసరి కూలీల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆధార్ కేంద్రం ఆదివారం కూడా పనిచేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

ప్రజా ప్రతినిధులు, జిల్లా లోని అన్ని వర్గాల వారు, అన్ని గ్రామ ప్రజలు ఈ సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు యు ఐ డి ఏ ఐ రీజనల్ ఆఫీసు హైదరాబాద్ నుండి డిప్యూటీ డైరెక్టర్ ఎన్. జి. కృపానందం, రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, పాడేరు ఆధార్ సెంటర్,ఆధార్ ఆపరేషన్ మేనేజర్ ఓలుగు నాగరాజు, ఆపరేటర్స్ జి. ఆనంద్, డి.కె.కుమార్, జి.అనిల్ కుమార్, ఎన్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ రక్షణకు 'ఆపరేషన్ త్రిశూల్'.

మహిళా పోలీసులకు ఏఎస్పీ మహేంద్రసిన్హా దిశానిర్దేశం.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.** మహిళల రక్షణ, రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా జిల్లా పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ త్రిశూల్' విజయవంతానికి గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని చింతపల్లి సబ్ డివిజనల్ ఏఎస్పీ మహేంద్రసిన్హా మహిళా పోలీసులకు దిశానిర్దేశం చేశారు. చింతపల్లిలో ఉమెన్ పోలీస్ స్టేషన్ (ఉమెన్ సేఫ్టీ సెల్) డీఎస్పీ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతపల్లి, కొయ్యూరు, జికె వీధి మండలాలకు చెందిన మహిళా పోలీసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందేలా చూడాలని సూచించారు. యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని, మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందన్నారు. అలాగే, నానాటికీ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించాలని ఆదేశించారు.ఆపరేషన్ త్రిశూల్ లోని ఈ మూడు ప్రధాన అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, నేరాల నియంత్రణలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించాలని ఏఎస్పీ సూచించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చింతపల్లి సీఐ సింహాచలం, ఎస్ఐ వీరబాబుతో పాటు ఆయా మండలాలకు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొమరాడ విద్యార్థులకు అప్రెంటిస్ షిప్ కార్యక్రమం



**కొమరాడ అక్టోబర్ 09 పెన్ పవర్:** మండలంలో కొమరాడ ఏ.పీ.టీ.డబ్ల్యూ.ఆర్.ఎస్ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి లక్ష్మణరావు ఆధ్వర్యంలో సమగ్ర శిశు పథకం ద్వారా వృత్తి విద్యలో భాగంగా అప్రెంటిస్ షిప్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ,ఈ వృత్తి విద్య అనేది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అప్రెంటిస్ షిప్ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రాక్టికల్ నైపుణ్యాలను విద్యార్థులు తాము నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో ఉపయోగించగలుగుతారని తక్కువ ఆర్థిక వ్యాయామంతో నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఐఏ ఆర్థిక భారం తగ్గుతుందని అంతేకాక మెరుగైన ఉపాధి అవకాశాలు విద్యార్థుల్లో ఉద్యోగం పొందే సామర్థ్యం పెరుగుతుంది విద్యార్థులకు త్వరగా ఉద్యోగాల్లో అవకాశాలు పొందడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందన్నారు.పది రోజుల సెలవు దినాల్లో విద్యార్థులకు ఇలాంటి ఒకేషనల్ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని ప్రభుత్వం విద్యార్థులకు శిక్షణ కాలంలో ఒక విద్యార్థికి 1250 రూపాయలతో పాటు టూల్ కిట్టు అర్హత కలిగిన సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందని ప్రధాన ఉపాధ్యాయులు అన్నారు.ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు ఎం అజయ్, ఎన్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

- ఏజెన్సీ ప్రాంత ప్రజల వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 09 పెన్ పవర్.** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య,ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గుమ్మలక్ష్మీపురం గ్రామపంచాయతీ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు బొత్తడ గౌరీ శంకర్రావుడిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,600 మంది కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఎన్నో సంవత్సరాలుగా వైద్య సేవలందిస్తున్న అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు,100 శాతం గ్రాస్ జీతాన్నిపునరుద్ధరించాలని,2018 నుంచి అమలులో ఉన్న వేతన తగ్గింపుపై సమీక్ష జరపాలని విజ్ఞప్తి చేశారు.పారామెడికల్ పోస్టులకు రెగ్యులర్ నియామక నోటిఫికేషన్లు విడుదల చేసి,అర్హులైన ప్రస్తుత కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలు,అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను ప్రభుత్వం విస్మరించకూడదు.గిరిజనగ్రామాలు,మారుమూల ప్రాంతాల ప్రజలు చిన్నపాటి వైద్య అవసరాలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి.ఇలాంటి ప్రాంతాల్లో స్టాఫ్ నర్సులు,ల్యాబ్ టెక్నీషియన్లు,ఫార్మసీ అధికారులు,ఇతర పారామెడికల్ సిబ్బంది సేవలు ఎంతో కీలకం.సిబ్బంది కొరత లేదా నిరసనల కారణంగా వైద్య సేవలకు అంతరాయం ఏర్పడితే పేద,గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదంఉంది.కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు,ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా ప్రభుత్వం సమన్వయంతో చర్యలు తీసుకోవాలి.అత్యవసర సేవలు,ఐసీయూ,క్యాజువాలిటీ,లేబర్ రూమ్ వంటి కీలక విభాగాల్లో రోగులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి.ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి,అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పటికీ స్పష్టమైన పరిష్కారం కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏ.పీ.ఎం.హెచ్.సి జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి,పెండింగ్ డిమాండ్లపై కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం,గిరిజన ప్రజల ఆరోగ్య భద్రత రెండింటినీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యంతో చూడాలి.కాంట్రాక్ట్ సిబ్బందికి న్యాయం చేస్తూనే,ఏజెన్సీ ప్రాంతంలోని పేద ప్రజలకు వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని బొత్తాడ గౌరీ శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రకృతి పాఠశాల.. కృష్ణాపురం ఈటీఐ.




- వన్యప్రాణులు, జలసంరక్షణపై విద్యార్థులకు అవగాహన.
- 'ఏఎస్ఆర్ అరణ్య' విశిష్టతలను వివరించిన డీఎఫ్ఓ వై.వి.నరసింహారావు.

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 9.** అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు అటవీ శాఖ శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. చింతపల్లి అటవీ సబ్ డివిజన్ పరిధిలోని కృష్ణాపురం ఎకో టూరిజం (ఈటీఐ) కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్రను వారు ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ విజ్ఞాన యాత్రలో భాగంగా విద్యార్థులు ముందుగా అటవీ ప్రాంతంలోని 'పైనరీ' (పైన్ వృక్షాల పెంపకం కేంద్రాన్ని) వీక్షించారు. అనంతరం అటవీశాఖ అధికారులు విద్యార్థులకు అడవుల ఆవశ్యకత, వన్యప్రాణుల జీవనశైలితో పాటు జలసంరక్షణ (వాటర్ కన్జర్వేషన్) ప్రాధాన్యాన్ని వివరించారు. చెట్లను సంరక్షించుకోవడం ద్వారానే భూగర్భ జలాలను పెంపొందించవచ్చని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చింతపల్లి డీఎఫ్ఓ వై.వి.నరసింహారావు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. అటవీ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఏఎస్ఆర్ అరణ్య' ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యాలను, దాని విశిష్టతలను ఆయన సోదాహరణంగా వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల పాత్ర కీలకమని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే విద్యార్థి దశ నుంచే ప్రకృతి పట్ల ప్రేమను పెంచుకోవాలని ఆయన సూచించారు. అహ్లాదకరమైన వాతావరణంలో అటవీ అందాలను ఆస్వాదిస్తూ కొత్త విషయాలు నేర్చుకోవడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోపాలపట్నంలో అత్యాధునిక క్రీడా ప్రాంగణం ప్రారంభం

- రూ.1.22 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా వసతులు
- యువతకు కొత్త ఉత్సాహం
- ప్రారంభించిన ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు
- మైదానంలో క్రీడలు ఆడుతూ యువ క్రీడాకారుల్లో జోష్





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 9 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం క్రీడారంగంలో మరో ముందడుగు పడింది. స్థానిక 92వ వార్డు పరిధిలోని చారిత్రాత్మక ఎస్.వి.ఎల్.ఎన్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.122.75 లక్షల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక క్రీడా ప్రాంగణాన్ని విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఏపీ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు అవసరమైన ఆధునిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఈ క్రీడా ప్రాంగణంలో అత్యాధునిక వాకింగ్ ట్రాక్, బాక్స్ క్రికెట్ కోర్టు, పికిల్‌బాల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లోనూ క్రీడలు ఆడేందుకు వీలుగా హైమాస్ట్ లైటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకే ప్రాంగణంలో వివిధ క్రీడలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో స్థానిక యువత, క్రీడాకారులు, వాకర్లకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రారంభోత్సవం అనంతరం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు మైదానంలోకి దిగి స్థానిక క్రీడాకారులతో కలిసి పికిల్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ ఆడారు. ప్రజాప్రతినిధులు స్వయంగా క్రీడల్లో పాల్గొనడం యువతలో ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నంలోని ఎస్.వి.ఎల్.ఎన్. ఉన్నత పాఠశాలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసి, స్థానిక విద్యార్థులు, యువతకు మెరుగైన క్రీడా వసతులు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే ఈ మైదానంలో బాక్సింగ్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు ఉండగా, ప్రస్తుతం బాక్స్ క్రికెట్, పికిల్‌బాల్ వంటి ఆధునిక క్రీడలకు కూడా వసతులు కల్పించినట్లు తెలిపారు. బయట ప్రైవేటు ప్రాంగణాల్లో అధిక ఖర్చుతో ఆడాల్సిన బాక్స్ క్రికెట్‌ను స్థానిక యువతకు అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న పికిల్‌బాల్ క్రీడకు కూడా ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినట్లు వివరించారు. క్రీడా వసతులు కల్పించడంతోనే లక్ష్యం పూర్తికాదని, వాటిని సద్వినియోగం చేసుకునేలా నిరంతర శిక్షణ, నైపుణ్యం కలిగిన కోచ్‌లు, క్రీడాకారుల భాగస్వామ్యం, పోటీల నిర్వహణ కూడా అవసరమని గణబాబు స్పష్టం చేశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించి, చిన్న వయసు నుంచే సరైన శిక్షణ అందిస్తే భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేయవచ్చని అన్నారు. ఈ ప్రాంగణంలో భవిష్యత్తులో మెగా టోర్నమెంట్లు నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తూ, స్థానిక ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ, క్రీడా మైదానాల అభివృద్ధిలో ఎమ్మెల్యే గణబాబు చూపుతున్న ఆసక్తిని అభినందించారు. దాదాపు 32 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్న గణబాబు, తాను చదువుకున్న పాఠశాల మైదానాన్ని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణాల నిర్మాణం అంటే కేవలం స్థలాన్ని చదును చేసి మట్టి పోయడం మాత్రమే కాదని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడటం, మైదానం ఎక్కువకాలం మన్నికగా ఉండేలా నిర్మించడం, క్రీడాకారులకు అనువైన ఉపరితలాన్ని రూపొందించడం వంటి అంశాల్లో శాస్త్రీయ విధానాలు అవసరమని వివరించారు. ఈ మైదానంలో నీటి పారుదల, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాకింగ్ ట్రాక్ గురించి ప్రస్తావిస్తూ, పాదరక్షలు లేకుండా నడిచేందుకు అనువుగా, రంపపు పొట్టు తదితర పదార్థాల మిశ్రమంతో ట్రాక్‌ను రూపొందించినట్లు వివరించారు. వర్షం పడినప్పుడు బురద ఏర్పడకుండా, ప్రజలు సౌకర్యవంతంగా నడిచేలా సుమారు మూడు మీటర్ల వెడల్పుతో దీనిని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. పికిల్‌బాల్ క్రీడ ప్రత్యేకతను వివరిస్తూ, తాను గతంలో టెన్నిస్ ఆడేవాడినని, గాయాల కారణంగా కొంతకాలం ఆటకు దూరమైనప్పటికీ, రెండేళ్ల క్రితం పికిల్‌బాల్ ద్వారా మళ్లీ క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఫిట్‌నెస్ సాధించానని శ్రీభరత్ తెలిపారు. టెన్నిస్ కోర్టు విస్తీర్ణంలో నాలుగు పికిల్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో, తక్కువ స్థలంలో ఎక్కువ మందికి క్రీడా సౌకర్యాలు కల్పించవచ్చని వివరించారు. నేర్చుకోవడానికి సులభంగా ఉండే ఈ క్రీడను అన్ని వయసుల వారు అభ్యసించవచ్చని చెప్పారు. ప్రజాప్రతినిధులు సైతం క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువతకు ఆదర్శంగా నిలవాలని అభిప్రాయపడ్డారు.ప్రస్తుత జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోవడం ఆందోళనకరమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎక్కువసేపు కూర్చుని ఉండటం, మొబైల్ ఫోన్లకు అధికంగా సమయం కేటాయించడం వల్ల శారీరక చురుకుదనం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల నివారణలో క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం కీలకమని తెలిపారు. యువత రోజూ కనీసం గంట లేదా రెండు గంటలు క్రీడా మైదానాల్లో గడుపుతూ శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడా ప్రాంగణాలను నిర్మించడంతోపాటు వాటి నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, మైదానాల నాణ్యతను కాపాడేందుకు స్థానిక స్థాయిలో తగిన నిర్వహణ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శ్రీహరిపురంలో గతంలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని గణబాబు తెలిపారు. ఆ స్టేడియాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ప్రజలకు అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో క్రీడా మౌలిక వసతులను మరింత విస్తరించి, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్, విశాఖపట్నం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఆర్. జూన్ గల్లియోట్ రోడ్రిగ్స్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, జోనల్ కమిషనర్ హేమవతి, జనసేన వెస్ట్ ఇన్‌చార్జి అంగ ప్రశాంతి, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, జీవీఎంసీ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, స్థానిక క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోపాలపట్నంలో అన్ని వసతులతో కూడిన ఆధునిక క్రీడా ప్రాంగణం అందుబాటులోకి రావడంపై స్థానికులు, వాకర్లు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే స్థానిక క్రీడా ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, భవిష్యత్తులో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

# టీడీపీ కార్యకర్తలు పార్టీ మారారన్న ప్రచారం అవాస్తవం



**వైసీపీ నేతలనే కొత్తగా చేరినట్లు చూపిస్తున్నారని గొలగాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపణ**

**బుచ్చెయ్యపేట, పెన్ పవర్ అక్టోబర్ 9 :** లోమల్లం, భూపతిపాలెం గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని మాజీ సర్పంచ్, జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు గొలగాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలోనూ వైసీపీలో ఉన్న వ్యక్తులనే తాజాగా టీడీపీ నుంచి చేరినట్లు చూపిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ పంచాయతీ నుంచి ఏ ఒక్క టీడీపీ కార్యకర్త కూడా పార్టీ మారలేదని, మారే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఇటీవల పంచాయతీ పరిధిలో జరిగిన మూడు పాఠశాలల కమిటీ ఎన్నికల్లోనూ కూటమి మద్దతుదారులు విజయం సాధించారని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ విజయాలను జీర్ణించుకోలేక కొందరు పార్టీ మార్పుల పేరుతో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మండల, నియోజకవర్గ నాయకుల మెప్పు పొందేందుకే ఇటువంటి రాజకీయ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వ హయాంలో మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజు నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తూ, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తారని తెలిపారు.

కొంతమంది వైసీపీ నాయకులు గ్రామాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలతో వారిని నమ్మించడం సాధ్యం కాదని అన్నారు.

## వైసీపీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా యలమర్తి అచ్యుతరావు

**మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అచ్యుతరావు**



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 9 :** ఇటీవల అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమితులైన యలమర్తి అచ్యుతరావు (బుజ్జి) శుక్రవారం రాంపురంలోని కార్యాలయంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్‌కు శాలువా కప్పి సత్కరించారు. తనకు పార్టీ వాణిజ్య విభాగంలో కార్యదర్శిగా బాధ్యతలు కల్పించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించడం జరిగింది. ఈ భేటీ సందర్భంగా పార్టీకి సంబంధించిన అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. అనకాపల్లి జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమితులైన యలమర్తి అచ్యుతరావు (బుజ్జి)కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

## అనకాపల్లి జిల్లా వైసీపీ యువజన విభాగం కార్యదర్శిగా నరవ గణపతి

**మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్‌ను కలిసిన నరవ గణపతి**



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 9 :** ఇటీవల అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన నరవ గణపతి, ఈరోజు రాంపురంలోని కార్యాలయంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్‌కు శాలువా కప్పి సత్కరించారు. జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా నియామకం పొందిన అనంతరం నరవ గణపతి మాజీ ఎమ్మెల్యేను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా పరస్పరం అభినందనలు తెలియజేసుకుంటూ, పార్టీకి సంబంధించిన అంశాలపై మర్యాదపూర్వకంగా చర్చించారు. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం, ప్రజా సమస్యలపై స్పందించడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం వంటి అంశాలకు యువజన విభాగం ద్వారా ప్రాధాన్యత లభిస్తుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నరవ గణపతి పార్టీ బలోపేతానికి, యువతను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలందించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి. ఈ మర్యాదపూర్వక భేటీతో పార్టీ నాయకుల మధ్య పరస్పర సాన్నిహిత్యం మరోసారి వెల్లడైంది.

## 117వ వార్డులో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

**సమావేశానికి ముఖ్య అతిథులుగా శోభా హైమావతి, అదీప్ రాజ్**



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 9 :** జీవీఎంసీ పరిధిలో నూతనంగా ఏర్పాటైన 117వ వార్డులో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యురాలు, అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ శాసనసభ్యుడు, పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నూతనంగా ఏర్పాటైన 117వ వార్డులో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బోర్ మెకానిక్ దుర్మరణం



**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 9:** గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చందక గ్రామానికి చెందిన బోర్ మెకానిక్ రెడ్డి అప్పలనారాయణ (48) ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదం స్థానికంగా విషాదాన్ని నింపింది.

అప్పలనారాయణ ఆనందపురం జంక్షన్‌లో కొన్నేళ్లుగా బోర్ మెకానిక్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్న భోజనం కోసం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో పొడుగుపాలెం సమీపంలోని పూర్లవాని చెరువు వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అప్పలనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రాంతంలో బోర్ మెకానిక్‌గా మంచి గుర్తింపు పొందిన ఆయన మృతితో కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

# ప్రపంచ టాప్ 2% శాస్త్రవేత్తల జాబితాలో ఆదిత్య యూనివర్సిటీకి చెందిన నలుగురు అధ్యాపకులు






**వరుసగా మూడో ఏడాది అంతర్జాతీయ గుర్తింపు**

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 09:** పరిశోధన రంగంలో ఆదిత్య యూనివర్సిటీ మరో విశేష గుర్తింపును సాధించింది. 2026 సంవత్సరానికి సంబంధించి ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో యూనివర్సిటీకి చెందిన నలుగురు అధ్యాపకులు స్థానం సంపాదించినట్లు ప్రో ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఎల్సెవియర్ , స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీతో అనుసంధానమైన ఈ గుర్తింపు అధ్యాపకుల పరిశోధనా ప్రతిభకు, శాస్త్రీయ రంగంలో వారు చేస్తున్న కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు పొందిన వారిలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. పి.వి. ఎలుమలై, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. మహేష్ కుమార్ సింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. బి. రామ్మోహన్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. తాతబాబు అద్దేపల్లి ఉన్నారు. ఆదిత్య యూనివర్సిటీకి వరుసగా మూడేళ్లపాటు ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో గుర్తింపు లభించడం విశేషమని సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నాణ్యమైన శాస్త్రీయ ప్రచురణలను ప్రోత్సహించడంలో యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ విజయం అధ్యాపకుల నిరంతర పరిశోధనా తపనకు, విద్యా రంగంలో యూనివర్సిటీ సాధిస్తున్న ప్రగతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ గుర్తింపు అధ్యాపకులతోపాటు పరిశోధక విద్యార్థులు, ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అధ్యాపకులకు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ, డా. ఏ. రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, వివిధ విభాగాల డీన్లు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని పరిశోధనా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జగ్గంపేటలో కూటమి సుపరిపాలనకు నిదర్శనం



- ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 9** జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్నారని గండేపల్లి మండల జనసేన నాయకుడు, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగులూరి రామ్ దీప్ అన్నారు. ముఖ్యంగా జనసేన నాయకులకు తగిన గౌరవం ఇస్తూ, వారు తీసుకొచ్చే ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గండేపల్లి మండలం సుబ్బయ్యపేట గ్రామానికి చెందిన బోండా సీతారామయ్య అనారోగ్యంతో చికిత్స పొందగా, వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందజేసినట్లు రామ్ దీప్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.1,53,000 మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. మంజూరైన చెక్కును కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ లబ్ధిదారుడి ఇంటికి స్వయంగా వెళ్లి అందజేశారని చెప్పారు. ఇప్పటివరకు సుబ్బయ్యపేట గ్రామంలో జనసేన నాయకుల చొరవతో సుమారు రూ.8 లక్షల విలువైన ఏడు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరయ్యాయని రామ్ దీప్ వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించి, తనను ప్రోత్సహిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు, తనకు గుర్తింపునిచ్చి తన ద్వారా మరింతమందికి సేవ చేసే అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రామ్ దీప్ కృతజ్ఞతలు తెలిపారు. సుబ్బయ్యపేట గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తల తరఫున కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఈ నెల 11 నుంచి కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం--2026





- 2030 నాటికి వెయ్యి కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేయడమే లక్ష్యం
- దేశానికి ఆర్థిక మాంద్యం రాదు
- పరిపూర్ణానంద సరస్వతి

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 9:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం--2026ను ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు 11 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీపీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణానంద సరస్వతి వెల్లడించారు. భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. శుక్రవారం శ్రీపీఠంలో నిర్వహించిన కార్యక్రమంలో యాగం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ, శ్రీ ఐశ్వర్యాంబిక అమ్మవారి ఆశీస్సులతో వరుసగా నాలుగో ఏడాది 400 కోట్ల కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా మహిళల భాగస్వామ్యంతో లలితా సహస్రనామ పూర్వకంగా 300 కోట్ల కుంకుమార్చనలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. 2030 నాటికి మొత్తం వెయ్యి కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు అమ్మవారి అనుగ్రహాన్ని పొందే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 24 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ

మహాశక్తి యాగంలో భాగంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సుమారు 24 వేల మంది విద్యార్థులతో భారీ స్థాయిలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. విద్యార్థుల్లో విద్యాభివృద్ధి, జ్ఞానసంపద, ఏకాగ్రత పెంపొందించాలనే సంకల్పంతో ఈ పూజను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే ఈ నెల 18వ తేదీ అష్టమి సందర్భంగా ఉదయం పది వేల మంది మహిళలచే ఐశ్వర్య దీప పూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం వేద, ఆగమశాస్త్ర పండితుల సూచనల మేరకు సహస్ర కుండాత్మక నవశక్తి హోమాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బగళాముఖి, చండీ, వారాహి, సిద్ధ కుంజిక, మహాదుర్గ, అపరాజిత, శక్తి కవచం, ప్రత్యంగిరా, చండీ ధ్వజం తదితర నవశక్తి హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ యాగం జరిగే 11 రోజులపాటు శ్రీ ఐశ్వర్యాంబిక అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేష పూజలు, నైవేద్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. భక్తుల కోసం ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాశక్తి యాగాన్ని విజయవంతం చేయాలని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. మహాశక్తి యాగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి గత మూడేళ్లుగా మహాశక్తి యాగాన్ని భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించామని, అదే ఉత్సాహంతో ఈ ఏడాది కూడా నాలుగోసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యామని పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. యాగానికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వివిధ బృందాలుగా ఏర్పడి గత నెల రోజులుగా యాగం నిర్వహణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కమిటీ సభ్యుల కృషి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తన బంధుమిత్రుల సహకారంతో అవసరమైన నిధులు, ద్రవ్యాలను సమకూర్చుకుని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై పరిపూర్ణానంద వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా పరిపూర్ణానంద సరస్వతి తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతదేశానికి ఆర్థిక మాంద్యం వచ్చే పరిస్థితి ఉండదని ఆయన జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి నుంచి కిందిస్థాయి ప్రజాప్రతినిధుల వరకు ప్రజాసేవే లక్ష్యంగా జీతభత్యాలు లేకుండా పనిచేస్తే, దేశం మరిన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. మహాశక్తి యాగం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తుల్లో భక్తిభావం, సామాజిక ఐక్యత పెంపొందుతాయని పేర్కొంటూ, ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పరిపూర్ణానంద సరస్వతి పిలుపునిచ్చారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమం

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే నవభారత నిర్మాణం
- డాక్టర్ వి. కాటన్




**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 9:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకున్నప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ వి. కాటన్ అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా భారత ప్రభుత్వ యువజన, క్రీడా వ్యవహారాల శాఖ పిలుపుమేరకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం 'నషా ముక్త్ భారత్'యువమేలా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ వి.కాటన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించారు. మాదకద్రవ్యాల అలవాటు విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభ్యాసం, వ్యక్తిగత జీవితం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం. యువత దేశ భవిష్యత్తుకు ప్రతినిధులని, వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అన్నారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, విద్యార్థులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, సమాజంలోనూ ఈ అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. యువత ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే దేశ అభివృద్ధికి మరింతగా దోహదపడగలరని పేర్కొన్నారు. నిర్వాహకులకు అభినందనలు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.ం

## వీఆర్ఏ కుటుంబాలకు రెవెన్యూ సిబ్బంది చేయూత




**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 9:** మండల కేంద్రంలో గత 24 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని, జీతభత్యాలు లేక ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని కోరుతూ సమ్మె చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) కుటుంబాలకు ఆత్రేయపురం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. సమ్మె కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీఆర్ఏ కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, ఒక కిలో పంచదార, ఒక కిలో కందిపప్పు, ఒక కిలో పామాయిల్, ఒక కిలో గోధుమ పిండి, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. జీతభత్యాలు లేక జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్న వీఆర్ఏ కుటుంబాలకు ఈ సహాయం కొంత ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం తహశీల్దార్ రామచంద్రమూర్తి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినాయకుడు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లు పాల్గొన్నారు..

# విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ




**ఆనందపురం, పెన్ పవరే అక్టోబర్ 09,** విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించడంతోపాటు పాఠశాలలకు రాకపోకలను సులభతరం చేసేందుకు ఎన్ఎస్‌పీపీఎల్--ఎన్‌హెచ్ఐటీ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆనందపురం మండలం, దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా పరిధిలోని తర్లువాడ, సొంట్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్‌హెచ్ఐటీ జనరల్ మేనేజర్ సీహెచ్. కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థుల రోజువారీ ప్రయాణ ఇబ్బందులను తగ్గించి, చదువును కొనసాగించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సమాజ అభివృద్ధిలో భాగంగా విద్యార్థుల అవసరాలను గుర్తించి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఐటీ మేనేజర్ తేజు కుమార్ గోపి, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, టోల్‌ప్లాజా సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com